క్లుప్తంగా

ఆర్థిక సాయం



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఇటీవల మేకల రమేష్ మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి శుక్రవారం ఆటో యూనియన్ సభ్యులు రూ.6వేల నగదు సాయం అందజేశారు. అనంతరం ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి వెంట ఆటోయూనియన్ సభ్యులు తోట శ్రీనివాస్, శ్యాంలు ఉన్నారు.

ప్రత్యేక పూజలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని రామాలయంలో ఆలయ గోపుర సుదర్శనచక్ర ప్రతిష్ఠాపన పూజలను శుక్రవారం నిర్వహించారు. కాగా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, రామాలయ మాజీ చైర్మన్ కాకులమర్రి చక్రధర్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని కమిటీ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు మురళి, హయగ్రీవచారి, మణికంఠశర్మ, నాగేశ్వర్‌రావు, చైర్మన్ మోడెం రమేష్, మాజీ చైర్మన్ పోగుల లక్ష్మీనారాయణ, బాల్య ప్రసాద్, దీనబంధుస్వామి, అలువాల శ్రీనివాస్, బ్రహ్మం, సదానందం, పెండ్యాల సంతోష్, కత్తెర శ్రీనివాస్, వేణుగోపాల్ లాహోటి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాజేడు: మండల పరిధిలోని కొంగాల క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలను నిర్వహించారు. ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహన దారుల బ్యాగులను సోదాలు చేశారు. ముఖ్యంగా నగదు తరలింపులపై దృష్టిని కేంద్రీకరించారు.

రక్తదాన శిబిరం



గోవిందరావుపేట: ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలోని పస్రా గ్రామంలో సెయింట్ మేరీస్ స్కూల్‌లో భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మండలంలోని యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ. డీవైఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువత చేతిలోనే రాష్ట్ర భవిష్యత్

నర్సంపేట: యువత చేతిలోనే రాష్ట్ర భవిష్యత్ ఉందని, యువత సన్మార్గంలో నడవాలని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ అన్నారు. పట్టణంలోని సర్వాపురంలో ఎస్‌పీఎల్ సీజన్-2 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడలను శుక్రవారం నర్సంపేట-చంద్రుగొండ గ్రామాల మధ్య జరుగుతున్న క్రికెట్ పోటీలను టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం క్రికెట్ టీం సభ్యులకు టీ షర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిస కాకుండా యువత శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండడానికి కృషి చేయాలన్నారు. అనంతరం టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్‌ను కాంగ్రెస్ నాయకులు కొప్పుల అశోక్, పున్నం నర్సింహారెడ్డి, ధోని చేరాలు, ఎర్రబెల్లి ప్రదీప్, కొప్పు గాంధీ, ఈదుల రమేష్, ఎడ్ల రాజేష్‌లు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి సందీప్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పంబి వంశీకృష్ణ, పట్టణకార్యదర్శి చిప్ప నాగ, కోల చరణ్‌రాజ్, బిట్ల మనోహర్, శ్రీకాంత్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఎస్‌కె.షఫిక్, మహేష్, విక్రమ్, సాయివిక్రమ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

నర్సంపేట రూరల్ : పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని భాంజీపేట వైద్యాధికారి వింధ్య, జెడ్పీటీసీ కోమాండ్ల జయమ్మ అన్నారు. మండలంలోని కమ్మపల్లిలో గోపాలమిత్ర సెంటర్‌లో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సత్యనారాయణ, జయరామ్, సురేందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే చర్యలు



కాటారం: పట్టుకున్న గుడుంబా తయారీ సామగ్రితో పోలీసులు



మహాముత్తారం: బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

కాటారం: గుడుంబా తయారు చేసిన, విక్రయించిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ నరేందర్, ఎస్సై అభినవ్ అన్నారు. మండలంలోని గంగారంతండా, గంట్లకుంట గ్రామాల్లో అక్రమంగా తయారు చేస్తున్న గుడుంబా స్థావరాలపై శుక్రవారం ఎక్సైజ్, సివిల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుడుంబా తయారు చేసి సరఫరా, విక్రయానికి పాల్పడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. రెండు గ్రామాల్లో 600 లీటర్ల బెల్లం పానకం, తయారీ సామగ్రిని ధ్వంసం చేశామని తెలిపారు. 20 లీటర్ల గుడుంబా స్వాధీనపర్చుకున్నట్లు పేర్కొన్నారు. తయారిదారికి పాల్పడుతున్నట్లు ముగ్గురిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, అందులో ఒక వ్యక్తి గతంలో బైండోవర్ అవగా అతనిపై బ్రీచ్ కేసు నమోదు చేసినట్లు వివరించారు. గుడుంబా తయారి, విక్రయాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గుడుంబా, బెల్టుషాపుల నిర్వాహణపై నిఘా కొనసాగుతుందన్నారు.

మహాముత్తారం: మండలంలోని గాజరాంపల్లి గ్రామంలో ఎస్సై మహేందర్‌కుమార్ సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 15వందల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 62లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా గుడుంబా తయారు చేసిన, విక్రయించిన శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి తీసుకోవాలి



చిట్యాల: మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు



మొగుళ్లపల్లి: సీమంతాలు చేస్తున్న రజిత

చిట్యాల: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి నాగేశ్వర్‌రావు, ఐసీడీఎస్ సీడీపీఓ అవంతి అన్నారు. శుక్రవారం మండలంలోని నైన్‌పాక గ్రామంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గర్భిణులు బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అలాగే వ్యక్తిగత శుభ్రత తప్పకుండా పాటించాలని కోరారు. వ్యాధినిరోధక టీకాలు వేయించుకోవాలన్నారు. అలాగే మూడు సంవత్సరాల పిల్లలందరిని అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: అంగన్‌వాడీ కేంద్రంలో అందించే సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూపర్‌వైజర్ రజిత అన్నారు. శుక్రవారం మండలంలోని మేదరమెట్ల గ్రామంలో సెక్టర్ లెవెల్ పోషణ్ పక్వాడా కార్యక్రమం అంగన్‌వాడీ టీచర్లు రాణి, పద్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రజిత హాజరై మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామంలో పిల్లలకు పోషకాహారం లోపం లేకుండా చూడాలని అన్నారు. స్థానికంగా దొరికే ఆకు కూరగాయాలు, పండ్లు తీసుకోవాలని అన్నారు. చిరుధాన్యాలు కొర్రలు, సామలు, రాగులు, జొన్నలు , సజ్జలు ఆరికలు, వరిగెలు వంటి ధాన్యాలను ప్రతి రోజు ఆహారంలో భాగంగా చేర్చుకోవడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శారద, అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్



సీజ్ చేసిన లారీ వద్ద ఎస్సై చల్లా రాజు

వెంకటాపురం(ఎం): మండలంలోని బుర్గుపేట వాగు శివారులో నుంచి గురువారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై చల్లా రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బుర్గుపేట సమీప అటవీప్రాంతం నుంచి ఇసుకను తీసుకవచ్చి బుర్గుపేట వద్ద డంప్ చేసి అక్కడి నుంచి లారీలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు దాడులు చేసి లారీని అదుపులోకి తీసుకోని సీజ్ చేసినట్లు వెల్లడించారు. భూపాలపల్లి జిల్లా చెల్పూరుకు చెందిన లారీ యాజమాని రఘుపతిరెడ్డి, కుందురుపల్లికి చెందిన డ్రైవర్ సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

మహదేవపూర్: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఓఎస్‌డీ బుజంగారావు, కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రావు శుక్రవారం తనిఖీ చేశారు. మంగళవారం తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లోని గడ్చిరోలి జిల్లాలో పోలీసులు-మవోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మవోయిస్టులు మృతి చెందారు. ఈ సంఘటన నేపథ్యంలో మవోయిస్టులు భారత్ బందుకు పిలుపు ఇవ్వడంతో అప్రమత్తమైన పోలీస్ అధికారులు మహదేవపూర్ పోలీస్టేషన్ తనిఖీ చేసి పోలీసులకు పలు సూచనలు చేశారు. అలాగే మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద గల క్యాంపు కార్యలయాన్ని తనిఖీ చేసి మెడిగడ్డ ప్రాజెక్టు పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, సివిల్ సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రమేష్

వాజేడు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేరూరు ఎస్సై రమేష్ అన్నారు. మండల పరిధిలోని టేకులగూడెం గ్రామంలో శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఎస్సై మాట్లాడుతూ.. యువత గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. బాల్య వివాహాలు, చిన్న వయస్సులో ప్రేమ పేరుతో బంగారం లాంటి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుకొని ఉద్యోగాలను పొందాలన్నారు. గంజాయి, గుడుంబా, బెల్లం, పటిక లాంటివి సరఫరా చేస్తే చట్టపరంగా చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు



మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్

పలిమెల: వేసవి కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి ఎం.విజయ్‌భాస్కర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా తాగునీటి సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా స్పెషల్ డెవెలప్‌మెంట్ ఫండ్‌లో మంజూరైన పనులు, గ్రామ పంచాయతీ నిధుల నుంచి అడ్మిట్ స్టేటస్‌లో మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఎం.శ్రీనివాస్, ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి, ఏపీఓ సునీత, పంచాయతీ కార్యర్శులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం(కె): మండల పరిధిలోని విజయపూరి కాలనీలో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం పలువురి రక్త నమూనాలను సేకరించారు. గ్రామస్తులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయం



పూజలు చేస్తున్న సీతారాంనాయక్ దంపతులు

ములుగు రూరల్: కేంద్రంలోని ప్రధాని మోదీ నేతృతంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేసిందని మాజీ ఎంపీ ఆ పార్టీ మహబూబాద్ పార్లమెంట్ అభ్యర్థి అజ్మీర సీతారాం నాయక్ అన్నారు. శుక్రవారం ములుగులోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సీతారాంనాయక్‌తో పాటు క్లస్టర్ ఇన్‌చార్జ్ మాజీ ఎమెల్యే మార్తినేని ధర్మరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్ రావు ముఖ్య అతిథిలుగా హాజరైయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అవినీతి మచ్చలేని పాలన కొనసాగిస్తున్నారని అన్నారు.

రామప్పలో పూజలు

వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయాన్ని శుక్రవారం అజ్మీరా సీతారాంనాయక్ కుటుంబసమేతంగా సందర్శించారు. బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, రాష్ట్ర నాయకులు అజ్మీరా ప్రహ్లాద్, భూక్య రాజునాయక్, కృష్ణవేణినాయక్, దేవిలాల్, జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాంతో కలిసి రామప్ప రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, భూక్య జవహర్‌లాల్, వాసుదేవారెడ్డి, కారుపోతుల యాదగిరి, దొంతిరెడ్డి రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవ తప్పిదంతోనే నీటి కొరత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిన్న

ఏటూరునాగారం: మానవుల తప్పిదంతోనే నీటి కొరత వస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ నీళ్ల దినోత్సవాన్ని నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, ఎకనామిక్స్ ఆధ్వర్యంలో కళాశాల సెమినార్ ప్రాంగణంలో విద్యార్థులకు నీటి వల్ల ఉపయోగాలు, కొరత వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్న మాట్లాడుతూ.. ప్రపంచంలో నీటి కొరత ఏర్పడడానికి కారణం మానవుడేనని అన్నారు. నీటి కొరతను నివారించాలంటే అడవులను నరకకుండా, సామాజిక అడవులను పెంచి వర్షపాతాన్ని పెంచుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరమైన పనిముట్లను ఉపయోగించి నీటిని వృథా కాకుండా చూసుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవీందర్ మాట్లాడుతూ నీటిని దుర్వినియోగం చేయడం ద్వారా కొరత ఏర్పడుతుందన్నారు. ఇంకుడు గుంతల ద్వారా, వాటర్ షెడ్ల ద్వారా నీటిని భూమిలో ఇంకేటట్టు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం విజయలక్ష్మీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, టి రమేష్ కుమార్, డాక్టర్ బి రేణుక, నవీన్, సిహెచ్ వెంకటయ్య, ఫాతిమా, జ్యోతి, సంపత్, శ్రీధర్, రమేష్, నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతి పంపు ఏర్పాటు



ఆరెపల్లి శివారులో ఏర్పాటు చేస్తున్న చేతి పంపు

టేకుమట్ల: వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ఎంపీటీసీ బిక్కినేని అనితాసంపత్‌రావు మండలంలోని ఆరెపల్లి పల్లె ప్రకృతి వనం సమీపంలో శుక్రవారం చేతి పంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులకు, రైతులకు, ప్రయాణికులకు తాగు నీటి ఎద్దడి నివారణకు ఎంపీటీసీల నిధుల నుంచి బోర్ వేపించానని, ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావాలనే ఉద్దేశ్యంతో బోరింగ్‌ను బిగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోర్ టెక్నీషియన్ కర్ణె సుధాకర్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఆదివాసీల భూముల జోలికి రావొద్దు



మాట్లాడుతున్న చింత మోహన్

వాజేడు: అధికారులు ఆదివాసీల భూముల జోలికి రావొద్దని గోండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు చింత మోహన్ అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. లక్ష్మీపురం గ్రామంలోని సర్వే నంబర్ 50లో ఉన్న 28 ఎకరాల భూమిని కొన్ని సంవత్సరాల నుంచి గ్రామస్తులు నివాసం ఉంటున్నట్లు తెలిపారు. ఆ భూమిలోకి పోవద్దని గత ప్రభుత్వ హయాంలో అటవీ శాఖ వారు కందకాలను తవ్వినట్లు తెలిపారు. ఇప్పుడు నివాసం ఉంటున్న ప్రదేశంలో కూడా తమకు ఇంకా భూమి వస్తుందని దిమ్మెలను కడుతున్నారన్నారు. కందకాలు తవ్విన సమయంలో అటవీ శాఖకు ఎంత భూమి వస్తుందో తెలిక పోవడం విడ్డూరమన్నారు. మోడీకుంట ప్రాజెక్టు మూలంగా అటవీ శాఖ భూములు పోయాయని రెవెన్యూ వారు తమకు అప్పగించారని నివాస ముంటున్న భూములను లాక్కోవడానికి చూడటం సరైందని కాదన్నారు. ఆదివాసీల భూముల జోలికి అధికారులు ఎవరు వచ్చినా ఊరుకోమని భూములు దక్కే వరకు పోరాటం చేస్తామని తెలిపారు.

కరెంట్ కంచెలు ఏర్పాటుచేయొద్దు



ప్రజలతో మాట్లాడుతున్న పస్రా ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: పంట పొలాలకు రక్షణ కోసం, వన్య ప్రాణులను వేటాడుట కోసం ప్రజలు కరెంట్ తీగలతో కంచెలను ఏర్పాటు చేయొద్దని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. మండలంలోని రంగాపూర్ గ్రామంలోని ప్రజలతో ఎస్సై శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు తమ పంట పొలాలకు రక్షణ కోసం, వన్యప్రాణులను వేటాడుట కోసం కరెంట్ తీగలు అమర్చుతున్నారని అన్నారు. వీటి వల్ల ప్రజల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని, ముఖ్యంగా రైతులు పంట రక్షణ కోసం కరెంట్ తీగలు పెట్టొద్దని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఇలాంటి చర్యలకి ఎవరైనా పాల్పడితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మొద్దులగూడెం, లక్ష్మీపురం, కర్లపల్లి, సంద్రగూడెం, బాలాజీ నగర్, గాంధీ నగర్, పాపాయి పల్లి, రంగాపూర్ గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను క్షేత్ర స్థాయిలో ఎస్సై పరిశీలించారు.

ముస్తాబవుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయం



ఆలయం వద్ద వేసిన పందిళ్లు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం ఈ నెల 25 నుంచి నిర్వహించే తిరుకల్యాణానికి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. తిరుకల్యాణ మహోత్సవాలు ఐదు రోజుల పాటు కన్నుల పండుగగా నిర్వహించనున్నారు. 25న స్వామి వారి కల్యాణ మహోత్సవం, 26న స్వామివారి ఊరేగింపుసేవ, 27న సదస్యం, ఊరేగింపు, 28న పాలెం వాగుపై తెప్పోత్సవం రాత్రి 12 గంటలకు దొంగలదోపు కార్యకరమం, 29న చక్రతీర్థం, నాగబలి కార్యక్రమం, 30న వసంతోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా చలువ పందిల్లు, మంచినీటి సౌకర్యం , విద్యుత్ దీపాలలతో అలంకరణ చేశారు.

ఓటరు సంకల్ప పత్రం అందజేత



ఓటరు సంకల్ప పత్రం చూపిస్తున్న విద్యార్థులు

మంగపేట: మండలంలోని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి రూపొందించిన ఓటరు సంకల్ప పత్రాన్ని హెచ్ఎం రావుల భాస్కర్‌రావు శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 100 శాతం పోలింగ్ జరిగేందుకు దోహదపడే విధంగా ఎన్నికల పర్వం దేశానికి గర్వం అనే నినాదంతో ఓటరు సంకల్ప పత్రం ప్రధాన ఎన్నికల అధికారి రూపొందించి ప్రభుత్వ పాఠశాలలకు పంపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరు వందశాతం ఓటింగ్‌లో పాల్గొనాలని కోరుతూ సంకల్ప పత్రాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భానోత్ బాలాజీ, పాయం వీరనారాయణ, జమున, రాజ్యలక్ష్మీ, పావని, పద్మ, మహాదేవి, ఫతాన ఆస్మా, లావణ్య, లక్ష్మీనారాయణ, స్రవంతి, రాచమళ్ల సురేందర్ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థిని మృతి

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన భీముని వైష్ణవి((17) అనే విద్యార్థిని ఇటీవల పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన భీముని నర్సింహులు కూతురు వైష్ణవి మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుకుంటుంది. కాగా, తన స్నేహితుడు రాహుల్ పుట్టిన రోజు సందర్భంగా కేక్‌కట్ చేయించగా ప్రిన్సిపాల్ ఆమె తండ్రికి చెప్పి ఇంటికి పంపినట్లు తెలిపారు. దీంతో మరుసటి రోజు ఈ నెల 17న వైష్ణవి ఇంట్లో ఎవరు లేని సమయంలో పరుగుల మందు తాగింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకుని వెళ్లారు. కాగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. మృతిరాలి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410